సాక్షి
కుమురం భీం

బుధవారం, 26, జూలై, 2023



ఆపద్బాంధవులు
ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణం తర్వాత గుడిపేటకు చెందిన గంగపుత్ర సంఘం సభ్యులు బృందంగా ఏర్పడ్డారు. చేపల వేటతో ఉపాధి పొందుతూనే ప్రజాసేవ చేస్తున్నారు. 8లో▸



సమస్యలతో సతమతం..!
చింతలమానెపల్లి మండలంలో అభివృద్ధి పనులు ప్రణాళిక లేకుండా చేపడుతున్నారు. పలుచోట్ల డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో గ్రామాల్లో వరదనీరు నిలుస్తోంది. 9లో▸

గరిష్టం/కనిష్టం
30.1 /25.1

వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. రుతుపవనాలు, అల్పపీడనం ప్రభావంతో జిల్లా అంతటా ఉరుములు, మెరుపులతో మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అదనపు కలెక్టర్‌గా హేమంత కేశవ్ పాటిల్



ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా హేమంత కేశవ్ పాటిల్ నియామకమయ్యారు. ఇక్కడ పనిచేసిన అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ఉట్నూర్ ఐటీడీఏ పీవోగా బదిలీ అయిన విషయం తెలిసిందే. ఆ స్థానంలో హేమంత కేశవ్ పాటిల్ బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ మేరకు మంగళవారం సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు.

విద్యార్థులను పరిశోధనా రంగంలో ప్రోత్సహించాలి

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులను పరిశోధనా రంగం వైపు ప్రోత్సహించాలని డీఈవో అశోక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయం నుంచి జిల్లాలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఇన్‌స్పైర్ నామినేషన్లపై మంగళవారం ఆన్‌లైన్ డ్యూమీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి విద్యార్థుల్లో పరిశోధనలపై ఆసక్తి పెంచితేనే జాతీయస్థాయి కళాశాలల్లో ప్రవేశం పొందుతారని తెలిపారు. ఈ నెల 31లోగా ప్రతీ పాఠశాల నుంచి ఐదు నామినేషన్లు నమోదు చేసేలా ప్రధానోపాధ్యాయులు చొరవ తీసుకోవాలని సూచించారు. పల్లెలోని ఆణిముత్యాలను వెలికితీసే బాధ్యత ఉపాధ్యాయులపై ఉంటుందని జిల్లా సైన్స్ అధికారి మధుకర్ పేర్కొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఆసిఫాబాద్‌అర్బన్: వారం రోజులుగా జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రానున్న రెండురోజులపాటు జిల్లాకు వర్ష సూచన ఉన్నందున వరద ప్రభావిత ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రాణహిత, పెద్దవాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నందున అధికారులు ప్రత్యేక రక్షణ చర్యలు చేపడుతున్నారని అన్నారు. జిల్లా అధికార యంత్రాంగం నిత్యం అందుబాటులో ఉంటూ సాయమందించేందుకు సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. ప్రజల సౌకర్యార్థం సమీకృత కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సాయం కోసం ప్రజలు కంట్రోల్ రూం నంబర్లు 94905 34721, 96403 78917కు సమాచారం అందించాలని సూచించారు. 24గంటలు కంట్రోల్ రూంలో అధికారులు అందుబాటులో ఉంటారని వెల్లడించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలని ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న వాచర్లు

కాగజ్‌నగర్‌టౌన్: పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ కాగజ్‌నగర్ ఫారెస్ట్ డివిజన్ కార్యాలయం ఎదుట మంగళవారం వాచర్లు బైఠాయించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు సత్యనారాయణ, అంకుష్, మల్లేశ్, సోమయ్య మాట్లాడుతూ నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. చాలీచాలని వేతనాలు ఇస్తున్నారని, అవి కూడా ప్రతినెలా చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. ఏప్రిల్ నుంచి వేతనాలు చెల్లించడం లేదని, ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను అధికారులు అభివృద్ధి పనుల పేరిట మళ్లిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతినెలా వేతనాలు అందించేలా చర్యలు తీసుకోవాలని కార్యాలయ సూపరింటెండెంట్ విలాస్‌రావుకు వినతిపత్రం అందించారు.

'ప్రజలను మోసం చేస్తున్న బీఆర్‌ఎస్ సర్కార్'

కాగజ్‌నగర్‌రూరల్: రాష్ట్రంలోని పేద ప్రజలను బీఆర్‌ఎస్ సర్కార్ మోసం చేస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ ఆరోపించారు. కాగజ్‌నగర్ మండలం నజ్రూల్‌నగర్ విలేజ్ నం.1 గ్రామంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్నందున బీఆర్‌ఎస్ నాయకులు మాయమాటలతో ప్రజలను మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. డబుల్ బెడ్రూం ఇళ్లు, దళితులకు మూడెకరాలు, నిరుద్యోగ భృతి ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. పలు గ్రామాలకు కనీసం సరైన దారి సౌకర్యం కూడా లేదని విమర్శించారు. నాయకులు రణవీర్, కాళీదాస్ మజుందార్, అమిత్‌దాస్ ఉన్నారు.

భగీరథ బంద్

జిల్లాలో మిషన్ భగీరథ పథకం తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది. జోరుగా వర్షాలు పడుతున్న సమయంలో శుద్ధజలం అందక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. తాగునీటికి చేతిపంపులు, బావులపై ఆధారపడాల్సిన దుస్థితి నెలకొంది.



అడ ప్రాజెక్టు వాటర్‌గ్రిడ్ వద్ద చెత్త తొలగిస్తున్న సిబ్బంది

- జిల్లా వ్యాప్తంగా వారంరోజులుగా నిలిచిన తాగునీటి సరఫరా
- అడ ప్రాజెక్టు వద్ద వాటర్‌గ్రిడ్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారం, బురద
- మొరాయించిన మోటార్లు
- మరమ్మతులు చేపడుతున్న అధికారులు
- మరో రెండురోజులపాటు ఆటంకం

కౌటాల(సిర్పూర్): మిషన్ భగీరథ పథకం ద్వారా స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. నిత్యం ఏదో ఒకచోట వివిధ సమస్యలతో తాగునీటి సరఫరా నిలిచిపోతుంది. జిల్లాలోని అడ ప్రాజెక్టు వద్ద వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేసి పైప్‌లైన్ల ద్వారా గ్రామాలకు భగీరథ నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే అధిక వర్షాలతో కొద్దిరోజులుగా భగీరథ నీటి సరఫరా సజావుగా సాగడం లేదు. దీంతో ప్రజలు తాగునీటికి తండ్లాడుతున్నారు.

అసంపూర్తి పైపులైన్లు.. లీకేజీలు

జిల్లాలో రూ.కోట్లు వెచ్చించి ప్రారంభించిన మిషన్ భగీరథ పథకం నిర్వహణ అస్తవ్యస్తంగా మారడంతో మిషన్ భగీరథ నీటిపై ఆధార పడిన జిల్లా ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. అసంపూర్తి పైప్‌లైన్లు, లీకేజీలతోపాటు సాంకేతిక కారణాలతో తరచూ తాగునీటి సరఫరా నిలిచిపోతుంది. రంగు మారిన నీళ్ల సరఫరా అయిన సందర్భాలు సైతం ఉన్నాయి. శుద్ధం జలం అందకపోవడంతో ప్రజలు చేతిపంపులు, బావుల నీటిని తాగుతున్నారు.

ప్రత్యామ్నాయ చర్యలేవి..?

వారం రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయిన అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టలేదు. జోరుగా వర్షాలు పడుతుండటంతో బావుల్లోని కొత్త నీరు చేరింది. ఆ నీటిని తాగితే సీజనల్ వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది. మరో మూడు, నాలుగు రోజులపాటు మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిపివేయనున్నట్లు సమాచారం. ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకుండా పనులు చేపడితే తాగునీటి ఇక్కట్లు తప్పవని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిలిచిన సరఫరా



కౌటాలలో నిరుపయోగంగా భగీరథ నల్లా

భారీ వర్షాల కారణంగా అడ ప్రాజెక్టు వద్ద ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ వాటర్ గ్రిడ్‌లో చెట్ల కొమ్మలు, చెత్తాచెదారం, బురద పేరుకుపోయింది. భగీరథ నీటిని సరఫరా చేసే మోటర్లు మొరాయించడంతో జిల్లావ్యాప్తంగా వారం రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది. జిల్లాలోని 335 గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రజలకు శుద్ధజలం అందడం లేదు. అలాగే కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట్ మండలాలకు అయితే 15 రోజుల నుంచి నీటి సరఫరా కావడంలేదు. ఈ నెల 6న కౌటాల మండలం శివలింగాపూర్ పరిధిలోని మిషన్ భగీరథ నీటి సరఫరా ప్రధాన పైపులకు మరమ్మతులు చేపట్టారు. మరమ్మతుల అనంతరం జిల్లా అంతటా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో కాగజ్‌నగర్ పట్టణ ప్రజలతోపాటు గ్రామీణులకు మురుగునీరే దిక్కవుతుంది. గ్రామాల్లో గేట్‌వాల్స్ అదనంగా ఏర్పాటు చేయడం, నీటి లీకేజీలను నివారించాల్సి బాధ్యత పూర్తిగా పంచాయతీలదేనని అధికారులు చెబుతున్నారు.

తాగునీటికి తిప్పలు



గ్రామంలో 15 రోజుల నుంచి మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదు. తాగు నీటికి తీవ్ర తిప్పలు పడుతున్నాం. తప్పనిసరి పరిస్థితుల్లో చేతిపంపు నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నాం. కలుషిత నీటిని తాగలేకపోతున్నాం. వెంటనే శుద్ధమైన తాగు నీటిని సరఫరా చేయాలి.

– వందన, యాపలగూడ, కౌటాల

వాటర్ గ్రిడ్‌లో పనులు

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నీటి సరఫరా చేసే పైపుల వద్ద చెట్ల కొమ్మలు, బురద, చెత్తాచెదారం పేరుకుపోయింది. నాలుగు రోజులుగా నీటి శుద్ధికేంద్రం వద్ద పనులు చేస్తున్నారు. కౌటాలలో పైపులైన్ మరమ్మతు పనులు పూర్తిచేశాం. మరో మూడు రోజుల్లో అందరికీ తాగునీటిని సరఫరా చేస్తాం.

– ఇనోస్, ఏఈ, కౌటాల

రెండు రోజుల్లో పునరుద్ధరిస్తాం

ఆసిఫాబాద్‌అర్బన్: ఇటీవల కురుస్తున్న వర్షాలకు కుమురంభీం(అడ) ప్రాజెక్టులోకి భారీ వరద చేరింది. చెత్తాచెదారంతో మోటార్లలో సమస్య తలెత్తింది. టెక్నీషియన్లు రాత్రింబవళ్లు మరమ్మతులు చేపడుతున్నారు. రెండు రోజుల్లో పనులు పూర్తి చేసి ప్రజలకు తాగునీటి సరఫరాను పునరుద్ధరిస్తాం.

– వెంకటపతి, మిషన్ భగీరథ ఈఈ

జిల్లాలో 23.8 మి.మీ.ల వర్షం



అడ ప్రాజెక్టు నుంచి కిందికి వెళ్తున్న నీరు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా వ్యాప్తంగా మంగళవారం 23.8 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా బెజ్జూర్ మండలంలో 44 మి.మీ. వర్షం కురవగా, సిర్పూర్(టి)లో 6.6 మి.మీ., కాగజ్‌నగర్‌లో 7.4 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. అలాగే వాంకిడి మండలంలో 29.4 మి.మీ. కౌటాల 9.6, కెరమెరి 28.2, జైనూర్ 37.2, పెంచికల్‌పేట్ 16.8, లింగాపూర్ 30.4, ఆసిఫాబాద్ 26.2, రెబ్బెన 25.4, తిర్యాణి 17.8, చింతలమానెపల్లి 14.2, సిర్పూర్(యూ) మండలంలో 30 మి.మీ. వర్షపాతం నమోదైంది.

అడ ప్రాజెక్టుకు కొనసాగుతున్న వరద

జిల్లాలో కురుస్తున్న వర్షాలకు అడ(కుమురంభీం) ప్రాజెక్టుకు వరద కొనసాగుతుంది. మంగళవారం ప్రాజెక్టు రెండు గేట్లను ఎత్తారు. 3,216 క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నారు. ప్రస్తుతం 5.4 టీఎంసీల నీటి నిల్వ ఉంది.

'ప్రాణహిత' వరదతో దెబ్బతిన్న పంటలు

పెంచికల్‌పేట్: మండలంలోని మురళీగూడ, జిల్లెడ గ్రామ శివారులోని పంటలు ప్రాణహిత వరదలతో దెబ్బతిన్నాయి. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు నదికి వరద పోటెత్తి పంట పొలాలను ముంచెత్తింది. వరి, పత్తి పంటలు పూర్తిగా నీట మునిగాయి.



మురళీగూడలో దెబ్బతిన్న పత్తిపంట

ఓటు నమోదుపై అవగాహన కల్పించాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని ఆదివాసీ గ్రామాల ప్రజలు, పీటీజీలు, మహిళలు, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లతోపాటు ప్రతిఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం డీఆర్‌వో రాజేశ్వర్‌తో కలిసి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఓటరు జాబితా తయారీపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా పారదర్శకంగా రూపొందించాలని అధికారులను ఆదేశించారు. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. బూత్‌స్థాయి అధికారులకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకారం అందించాలని కోరారు. ఒకే ఇంటిలో అర్హత కలిగిన ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలోకి వచ్చేవిధంగా జాబితా రూపొందించాలన్నారు. 1,300 మంది ఓటర్లు దాటితే అదనపు పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో ఎన్నికల డీటీలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలి

- డీఆర్‌డీవో సురేందర్



మాట్లాడుతున్న డీఆర్‌డీవో సురేందర్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సురేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో పండ్ల తోటల పెంపకంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా రైతులు పండ్ల తోటల పెంపకంపై దృష్టి సారించాలని సూచించారు. జిల్లాలో 1,015 ఎకరాల్లో తోటల పెంపకం చేపట్టాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు వెల్లడించారు. ఇందుకు అనుగుణంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పండ్ల తోటల పెంపకంపై రైతులకు వ్యవసాయ, ఉద్యానవన శాఖల ఆధ్వర్యంలో అవగాహన కల్పించాలన్నారు. అధిక దిగుబడులు సాధించేందుకు అవసరమైన సస్యరక్షణ చర్యలను వివరించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్రంలో సుమారుగా 50 లక్షల జనాభా ఉన్న ముదిరాజ్ కులస్తులకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సెర్ల మురళీధర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలుగా ఉన్న ముదిరాజ్‌లు.. తెలంగాణలో మాత్రం ఒకే ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకి పరిమితం కావడం బాధాకరమన్నారు. తొమ్మిది డీసీసీబీ చైర్మన్లు, 32 జెడ్పీ చైర్మన్లలో ఒక్కదానిలో కూడా ముదిరాజ్‌ల ప్రాతినిధ్యం లేకపోవడం వారిని మోసం చేస్తున్నట్లు కాదా అని ప్రశ్నించారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ సమావేశం



మాట్లాడుతున్న సభ్యులు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని పటేల్ గార్డెన్‌లో మంగళవారం కాగజ్‌నగర్ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గం అమలు చేస్తున్న కుటుంబ భరోసా పథకంపై అవగాహన కల్పించారు. సభ్యత్వం ఉన్న ఫొటో, వీడియోగ్రాఫర్ మృతి చెందితే బాధిత కుటుంబానికి రూ.1.50 లక్షలు అందించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 66 మందికి ప్రయోజనం కలిగిందన్నారు. ప్రతీ ఫొటో, వీడియోగ్రాఫర్ సభ్యత్వం తీసుకోవాలని సూచించారు. అనంతరం నూతనంగా సభ్యత్వం తీసుకున్న వారికి అసోసియేషన్ గుర్తింపు కార్డులు అందించారు.

అందని రైతుబంధు

- ఐదెకరాలపైన భూమి ఉన్న రైతులకు జమ కాని వైనం
- జిల్లాలో 38,909 మందికి తప్పని ఎదురుచూపులు
- జోరందుకున్న సాగు పనులు
- పెట్టుబడికి అన్నదాతలకు ఇబ్బందులు



రెబ్బెన(ఆసిఫాబాద్): సాగును ప్రోత్సహించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఏటా రెండు సీజన్లలో ఎలాంటి పరిమితి లేకుండా రైతుబంధు పథకం కింద రైతులకు పెట్టుబడి సాయం అందిస్తోంది. ఎకరానికి రూ.5వేల చొప్పున ఏడాదికి రూ.10వేల నగదు నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది. ప్రస్తుత వానాకాలం సీజన్‌కు సంబంధించి పెట్టుబడి సాయం పంపిణీ జూన్ 26న రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైంది. ప్రభుత్వం మొదట తక్కువ విస్తీర్ణం ఉన్న భూములు ఉన్న రైతుల ఖాతాల్లో జమ చేస్తూ వచ్చింది. అయితే ఈసారి చాలా మంది రైతులకు పెట్టుబడి సాయం అందకపోవడంతో ఎదురుచూపులు తప్పడం లేదు.

స్పష్టత కరువు..

ఎకరం నుంచి ఐదెకరాల లోపు భూమి ఉన్న రైతుల బ్యాంకు ఖాతాల్లో రైతుబంధు జమ కాగా, ఐదెకరాల నుంచి ఆపై భూమి ఉన్న వారు పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో పంటల సాగు ఊపందుకుంది. పత్తిలో కలుపు తీత, పురుగు మందుల పిచికారీ, ఎరువులు చల్లడం వంటి పనులు కొనసాగుతున్నాయి. వరి సాగుకు పొలాలు సిద్ధం చేసే పనుల్లో అన్నదాతలు నిమగ్నమయ్యారు. ఈ తరుణంలో రైతుబంధు నగదు అందిందే రైతులకు కొంత ఊరటగా ఉంటుంది. ఐదెకరాల పైన భూమి ఉన్న రైతులకు అందాల్సిన పెట్టుబడి సాయంపై అధికారులు స్పష్టతనివ్వడం లేదు. ఎప్పటివరకు జమ చేస్తారో తెలియక రైతులు మదనపడుతున్నారు. పంటల సాగుకు అప్పులు చేయాల్సి వస్తుందని వాపోతున్నారు.

38,909 మందికి ఎదురుచూపులు

ఈ వానాకాలం సీజన్‌లో రైతుబంధు పథకానికి 1,37,808 మందిని వ్యవసాయశాఖ అర్హులుగా గుర్తించింది. వారి వివరాలన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేసి ప్రభుత్వానికి ప్రతిపాదించింది. ఇందులో ఇప్పటివరకు కేవలం 98,899 మందికి మాత్రమే రూ.108,70,06,129 నగదు అందింది. నగదు జమ అయిన రైతుల్లో ఎకరం నుంచి ఐదెకరాల లోపు భూమి ఉన్న వారే ఉన్నారు. ఆపై భూమి ఉన్న 38,909 మందికి పెట్టుబడి సాయం కింద రూ. 1,13,38,64,843 నగదు అందాల్సి ఉంది. ప్రభుత్వం కొన్నిరోజులుగా నగదు విడుదల చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సీజన్ సగానికి వచ్చినా నగదు చేతికందకపోవడంతో సాగుకు పడరాని పాట్లు పడుతున్నారు. సమాచారం కోసం వ్యవసాయ కార్యాలయాలు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కాగా గత వానాకాలంతో పోల్చితే ఈసారి రైతుబంధు లబ్ధిదారుల సంఖ్య భారీగా పెరిగింది. గతేడాది వానాకాలంలో 1,19,165 మంది రైతులు ఉండగా, ఈసారి వారి సంఖ్య 1,37,808కి పెరిగింది.

అప్పు తెచ్చి పెట్టిన



ఆరున్నర ఎకరాల్లో ప్రతి సంవత్సరం పత్తి సాగు చేసిన. ఈ సారి పత్తి విత్తనాలు, కూలీల ఖర్చు కోసం బయట అప్పు తీసుకువచ్చి పెట్టిన. రైతుబంధు పైసలు వచ్చినంక ఇద్దామనుకున్న. కానీ ఇప్పటివరకు పైసలు పడలేదు. అందరికీ పడ్డయి కానీ మాకు మాత్రం రాలే. ఎప్పుడు పడుతాయో కూడా తెలుస్తలేదు.

– అజ్మీర బాలుషా, గోలేటి

ఖర్చులకు ఇబ్బంది



రైతుబంధు పైసలు పడక పోవటంతో పెట్టుబడి ఖర్చులకు మస్తు ఇబ్బందైతంది. నాకు ఐదున్నర ఎకరాల భూమి ఉంది. ఏటా అందరితో పాటే కాస్త అటో ఇటో రైతుబంధు పైసలు పడేవి. ఈసారి మాత్రం ఇప్పటి వరకు పడలేదు. పంట సాగు ఖర్చులకు ఇబ్బంది అయితంది. పత్తిలో కలుపు తీసేందుకు, ఎరువు కొనేందుకు చేతిలో పైసలు లేవు.

– దారావత్ ఆలియా, గోలేటి

ఆందోళన వద్దు



జిల్లాలో ఇప్పటివరకు రైతుబంధు అందని వారు ఆందోళన చెందాల్సిన పనిలేదు. ప్రభుత్వం భూమి ఉన్న ప్రతీ రైతుకు పెట్టుబడి సాయాన్ని వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తుంది. ఇప్పటికే జిల్లాలోని రైతులందరికీ పెట్టుబడి సాయం అందాల్సి ఉండగా కొంత ఆలస్యంగా జమవుతున్నాయి. త్వరలోనే రైతుబంధు డబ్బులు జమ అవుతాయి.

– శ్రీనివాసరావు, డీఏవో

భక్తిశ్రద్ధలతో కావడి యాత్ర



శోభాయాత్ర నిర్వహిస్తున్న మహిళలు

కాగజ్‌నగర్‌టౌన్/కాగజ్‌నగర్‌రూరల్: దేశంలోని వివిధ పుణ్యక్షేత్రాల నుంచి తీసుకొచ్చిన నదీ జలాలతో మంగళవారం కాగజ్‌నగర్ పట్టణంలో కావడి యాత్ర భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా ఉదయం పట్టణంలోని హనుమాన్ మందిరంలో పూజారి నారాయణశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం నుంచి కావడి యాత్ర ప్రారంభించారు. ఈ యాత్ర ప్రధాన రహదారి గుండా మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న ఆలయం వరకు శివనామ స్మరణతో కనుల పండువగా సాగింది. నదీ జలాలతో వచ్చిన భక్తులకు శివమల్లన్న ఆలయంలో సంప్రదాయం ప్రకారం వేదపండితులు నరహరిశర్మ, ఆలయ అర్చకులు సంతోష్‌శర్మ, ఆలయ కమిటీ చైర్మన్ రాజేశ్వర్‌రావు, సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన నదీ జలాలతో మాజీ ఎమ్మెల్యే పాల్వాయి రాజ్యలక్ష్మితోపాటు భక్తులు శివుడికి అభిషేకం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాస్, కావడి యాత్ర నిర్వహణ సమితి ప్రతినిధులు ప్రయాగ్ తివారీ, అతుల్ గోహిల్, శశిలోయా, జవాహర్, పవన్ బల్దువా, విలాస్ షరాఫ్, మార్వాడీ మహిళలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుంతలో దిగబడిన ఆర్టీసీ బస్సు



గుంతలో దిగబడిన ఆర్టీసీ బస్సు

మందమర్రిరూరల్(చెన్నూర్): మందమర్రి పట్టణంలోని మార్కెట్ మూలమలుపు వద్ద ఆర్టీసీ బస్సు గుంతలో దిగబడింది. సాయి బాబా ఆలయం పక్కన ఇటీవల రోడ్డును తవ్వి మిషన్ భగీరథ పైపులు వేశారు. గోదావరిఖని నుంచి బెల్లంపల్లి వెళ్తున్న ఆర్టీసీ బస్సు తవ్విన ప్రదేశం పైనుంచి వెళ్తుండగా గుంత ఏర్పడి అందులో దిగబడింది. కొంతసేపటికి డ్రైవర్ బస్సును యథావిధిగా బయటకు తీశాడు.

అదుపు తప్పి కాలువలో పడిన కారు



కిష్టంపేట సమీపంలో కాలువలో పడిన కారు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామ సమీపంలో ఉన్న జాతీయ రహదారిపై కల్వర్టు వద్ద కారు అదుపుతప్పి కాలువలో బోల్తా కొట్టింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌కు చెందిన ఐలయ్యయాదవ్ మంగళవారం మంచిర్యాల నుంచి కిష్టంపేట మీదుగా కారులో వెళ్తున్నాడు. అదుపు తప్పి కల్వర్టు వద్ద కాలువలో బోల్తా పడింది. కారులో ఉన్న ఐలయ్య ప్రమాదం నుంచి క్షేమంగా బయటపడ్డాడు.

గని ప్రమాదంలో కార్మికుడికి గాయాలు

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్సార్పీ 1 గనిలో జరిగిన ప్రమాదంలో నోముల సత్తయ్య అనే కోల్‌కట్టర్ కార్మికుని కళ్లకు గాయాలయ్యాయి. తోటి కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం సత్తయ్య సోమవారం రాత్రి విధులకు హాజరయ్యాడు. మంగళవారం తెల్లవారుజామున గని భూగర్భంలో కోల్ కట్టింగ్ పనులు నిర్వహిస్తుండగా మిస్‌ఫైర్ కావడంతో బొగ్గు దుమ్ము మొత్తం అతని కళ్లలో పడింది. స్పందించిన అధికారులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఐఎన్టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు జే.శంకర్‌రావు గని మేనేజర్ విజయ్‌కుమార్‌ని ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

మంచిర్యాలక్రైం: స్థానిక కాలేజీరోడ్డు సమీపంలోని పద్మనాయక ఫంక్షన్‌హాల్ వద్ద గంజాయి విక్రయించేందుకు యత్నిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ రాజు తెలిపారు. దొరగారిపల్లెకు చెందిన ఐత పవన్‌కళ్యాణ్, తన స్నేహితులు రాజేశ్, అరుణ్‌లతో కలిసి గంజాయ్ విక్రయించేందుకు పద్మనాయక ఫంక్షన్‌హాల్ వైపు వెళ్తుండగా తమకు అందిన సమాచారం మేరకు ఎస్సైలు రాజేందర్, జగదీశ్ పవన్‌కళ్యాణ్‌ను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల రాకను ముందస్తుగానే గమనించిన అతని స్నేహితులు పారిపోయారు. అతని వద్ద 4.35 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

పులి దాడిలో ఆవు మృతి

బెజ్జూర్(సిర్పూర్): పులి దాడిలో ఆవు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని ఎలుకపెల్లిలో మొర్లే బాపుకు చెందిన ఆవు మంగళవారం అటవీ ప్రాంతానికి మేతకు వెళ్లింది. మేత మేస్తుండగా ఒక్కసారిగా పులి వచ్చి ఆవుపై దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పశువుల కాపరి తెలిపాడు.

ఒకరిపై హత్యాయత్నం కేసు నమోదు

మంచిర్యాలక్రైం: పట్టణంలోని చున్నంబట్టి వాడకు చెందిన మహ్మద్ చాంద్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు సీఐ రాజు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం చున్నంబట్టి వాడలోనే ఉంటున్న సైదు రాజు, చాంద్‌ల మధ్య గొడవ జరిగింది. మహ్మద్ చాంద్ తన వద్ద ఉన్న కత్తితో రాజుపై దాడి చేయడంతో మెడపై గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఆపద్బాంధవులు..

వారు సాహసవీరులు.. అవును ఇది నిజం.. దాదాపు 16ఏళ్లుగా వారు బృందంగా ఏర్పడి సేవల్లో భాగస్వామ్యం అవుతున్నారు.. గోదావరిలో మునిగిన వారిని కాపాడడంలో, చనిపోయిన వారి మృతదేహాలను వెలికి తీయడంలో వారు ముందుంటున్నారు. అయితే వీరి సేవలకు కనీస గుర్తింపు కాదు కదా.. వీరిని పట్టించుకునే వారు లేరు.. పట్టేది చేపలు అయినా వీరి సాహసాలు అపూర్వం.. వీరి సాహసాలపై ప్రత్యేక కథనం..
– మంచిర్యాలరూరల్(హాజీపూర్)

- ఆపద.. గల్లంతు.. ఏదైనా ముందుంటారు..
- నీట మునిగిన వారిని కాపాడుతారు..
- గల్లంతైన వారి ఆచూకీ కనిపెడుతారు..
- ఎవరైనా సరే కాపాడేందుకు ధైర్యం చేస్తారు
- ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటే మరింత సేవ చేస్తాం
- గుడిపేట గంగపుత్ర సంఘ సభ్యుల సాహసగాథ..



ఎల్లంపల్లి ప్రాజెక్ట్ వద్ద గంగపుత్ర సంఘం కమిటీ సభ్యులు



ముల్కల్ల శివారులో గల్లంతైన మృతదేహాన్ని బయటకు తీసుకువస్తున్న గంగపుత్రులు (ఫైల్)

మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం గుడిపేట గ్రామానికి చెందిన గంగపుత్ర సంఘం 2008లో ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నిర్మాణ ప్రారంభం నుంచి ఒక బృందంగా ఏర్పడింది. అప్పటి నుంచి వీరు ఉపాధి పొందుతూనే మరోవైపు సేవ చేస్తూ జీవనం సాగిస్తున్నారు. గుడిపేటకు చెందిన సీనియర్లు, జూనియర్లు కలిసి ఈత కొట్టడంలో పూర్తిస్థాయి నైపుణ్యం ఉన్న మొత్తం 30మందితో కలిసి గుడిపేట గంగపుత్ర సంఘ సభ్యులుగా ఏర్పాటయ్యారు. ఇదే బృందం ప్రాజెక్ట్ రక్షణ సమితిగా కొనసాగుతోంది.

నిత్యం సాహసమే ఊపిరిగా..

గుడిపేట గంగపుత్ర సంఘం సభ్యులు నిత్యం సాహస కార్యక్రమాల్లో భాగస్వామ్యం అవుతూ ఉంటారు. దాదాపు 15ఏళ్ల ప్రస్థానంలో భాగంగా ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తయిన అనంతరం వీరి సేవలు అధికమయ్యాయి. ఎనిమిదేళ్లుగా వీరి ప్రాధాన్యత, ప్రాచుర్యం పొందింది. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరదతో ప్రాజెక్ట్ నిండడం, ప్రాజెక్ట్ గేట్లు ఎత్తితే దిగువ గోదావరి ఉధృతంగా ప్రవహించడం వంటి సమయాల్లో గోదావరి పరీవాహక ప్రాంతాల్లో ప్రజల ప్రాణాలు కాపాడటంలో కానీ, పశు, గొర్ల కాపరులను కాపాడడంలో కానీ వీరి సేవలు నిత్యకృత్యం. అంతే కాదు మహాశివరాత్రి, కార్తీక మాసం పుణ్యస్నానాలు, గోదావరి పుష్కరాలు, గణేశ్, దుర్గాదేవి నిమజ్జన సమయాల్లో గంగపుత్ర సంఘంలోని గజ ఈతగాళ్ల అవసరం చాలా ఉంటుంది. ఇందులో భాగంగా ఇప్పటి వరకు ఈ బృందం 200మంది వరకు ప్రాణాలు కాపాడడంతో పాటు గోదావరి, ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి గల్లంతైన దాదాపు 20మందికి పైగా మృతదేహాలను బయటకు తీశారు.

అన్ని ఆపత్కాల సమయాల్లోనూ..

గుడిపేట గంగపుత్ర సంఘం సభ్యులు ఎలాంటి ఆపత్కాల సమయాలు ఎదురైనా సరే అందరికన్నా ముందు ఉండేది వీరే. గోదావరి, చెరువులు, వాగుల్లో గల్లంతైనా, నీట మునిగి ప్రాణాపాయ స్థితిలో ఉన్నా ఈ బృందం తక్షణమే స్పందిస్తుంది. ఎల్లంపల్లి ఎగువ భాగానే కాదు దిగువ భాగాన ఉన్న గుడిపేట, ముల్కల్ల, వేంపల్లి మీదుగా మంచిర్యాల వరకు కూడా ఉన్న గోదావరి మొత్తం గాలింపు చర్యలు చేపట్టిన సందర్భాలు సైతం ఉన్నాయి. గత ఏడాది వరదలు ముంచెత్తడంతో వేంపల్లి, ముల్కల్ల గోదావరి శివారుల్లో చిక్కుకున్న దాదాపు 40మందికి పైగా ప్రాణాలు కాపాడి శెభాష్ అనిపించుకున్నారు.

ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తే..

ఆపద సమయాల్లో సేవలు అందించే తమకు లైఫ్ జాకెట్లు, బోటు సౌకర్యాలు సమకూరిస్తే మరింత సేవ చేసి ఆదుకుంటామమని చెబుతున్నారు. గణేశ్, దుర్గాదేవి నిమజ్జన కార్యక్రమాలతో పాటు పుష్కర సమయాల్లోనూ, మహాశివరాత్రి, కార్తీకమాస పుణ్యస్నానాల సమయంలోనే కాకుండా గోదావరి ఉప్పొంగిన సమయాల్లో, పర్యాటకుల తాకిడి ఎక్కువ ఉన్న సమయాల్లో, గోదావరిలో గల్లంతైన వారి ఆచూకీ కోసం గంగపుత్ర సంఘంలోని గజ ఈతగాళ్లు ముదుండి మరీ సేవల్లో భాగస్వామ్యం అవుతున్నారు.

తక్షణమే స్పందిస్తాం..



వరదల్లోనే కాకుండా గోదావరి, చెరువులు ఇలా ఎక్కడ ఎవరూ ప్రమాదాల్లో చిక్కుకున్నా తక్షణమే స్పందిస్తాం. మా బృందంలో 30 మంది సభ్యులు నిత్యం అందుబాటులో ఉంటారు. ఎవరికి చెప్పిన వెంటనే ప్రమాదం జరిగిన ప్రాంతానికి వెళ్లి ఆదుకునేలా ప్రయత్నం చేస్తాం. ప్రాణాలు కాపాడమన్న సంతృప్తితో పాటు గల్లంతు అయిన మృతదేహాలను బయటకు తీసిన ప్పుడు కుటుంబ సభ్యుల ఆవేదన చూసి చాలా బాధగా ఉంటుంది. – జునగరి పవన్‌కుమార్, సభ్యుడు, గంగపుత్ర సంఘం

బాధగా ఉంటుంది..



వరదల్లో, గోదావరిలో కొట్టుకుపోయిన వారిని కాపాడే ప్రయత్నంలో కొంత మంది మృత్యువాత పడతారు. అలాంటి సమయంలో కాపాడలేక పోయామని బాధ ఉంటుంది. గల్లంతైన వారి మృతదేహాలను చూసిన సమయంలో వారి కుటుంబ సభ్యుల ఆవేదన చూసి అయ్యో కాపాడలేక పోయామని దిగులు ఉంటుంది. ఇక ప్రమాద సమయాల్లో అధికారులు పిలవగానే వెళ్లి కాపాడినా తమకు కనీస సహకారం కూడ ఉండదు. – మోగుర్ల మహేశ్, అధ్యక్షుడు, గంగపుత్ర సంఘం, గుడిపేట

‘మహోన్నతుల ఆశయసాధనకు అంకితమవుదాం’

- మావోయిస్టు సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మహోన్నతుల త్యాగాలను స్మరిస్తూ వారి ఆశయసాధనకు అంకితమవుదామని భారత కమ్యూనిస్టు పార్టీ(మావోయిస్టు) సింగరేణి కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి ప్రభాత్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2023 నాటికి విప్లవోద్యమాలను అంతమొందిస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎజెండాగా పెట్టుకున్నాయని ఈ క్రమంలో బీజేపీ మతరాజకీయాలకు పాల్పడుతూ విధ్వంసాలకు తెరతీస్తోందన్నారు. అన్నివర్గాలపై అక్రమ దాడులు, అరెస్టులు చేస్తూ ప్రశ్నించే గొంతుకను అణిచివేయాలనే ధోరణితో కేసీఆర్ వ్యవహరిస్తున్నారన్నారు. సమాధాన్ దాడిని ఓడించి మావోల పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

వండర్‌బుక్ ఆఫ్ రికార్డులో చోటు



సమోదుపత్రం అందుకుంటున్న శ్రీనివాస్

మంచిర్యాలఅర్బన్: పట్టణంలోని హైటెక్‌సిటీకి చెందిన శ్రీనివాసస్వామి శ్రీరామ దీక్షను చేపట్టి 108 రోజులపాటు రోజుకు 108 సార్లు 10,800 హనుమాన్ చాలిసా పారాయణం చేసి ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కించుకున్నారు. మంగళవారం మంచిర్యాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంస్థ తెలంగాణ స్టేట్ చీఫ్ కోఆర్డినేటర్ రాంప్రకాశ్ చేతుల మీదుగా రికార్డు నమోదు పత్రాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ ముఖేష్‌గౌడ్, నడిపెల్లి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ విజిత్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌రావు, కౌన్సిలర్ శ్రీ చైతన్య రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలని నిరసన

బెల్లంపల్లి: నిత్యం వందలాది మంది గ్రామీణులు రాకపోకలు సాగించే బెల్లంపల్లి–కాసిరెడ్డిపల్లి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కాంగ్రెస్ శ్రేణులు బురదరోడ్డుపై నాటువేసి నిరసన తెలిపారు. బెల్లంపల్లి పాత బస్టాండ్ చౌరస్తా నుంచి శ్రీసరస్వతీ శిశుమందిర్ మీదుగా కాసిరెడ్డిపల్లికి వెళ్లే రోడ్డుపై గుంతలు పడడంతో వరద నీరు నిలిచి రాకపోకలు సాగించడానికి వీలులేకుండా ఉంది. మార్గమధ్యలో అంబేద్కర్‌నగర్ రోడ్డుపై ఏర్పడ్డ గుంతల్లో కాంగ్రెస్ నాయకులు నాటు వేసి రోడ్డు దుస్థితిని తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా తమ పరిధి కాదని ఎవరికి వారు దాటవేత ధోరణి ప్రదర్శిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య స్పందించి రోడ్డు మరమ్మతులకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాతరి స్వామి, బండి ప్రభాకర్, తొంగల మల్లేశ్, ఎండీ అఫ్జల్, సిలివేరి సత్యనారాయణ, రవి, నారాయణ, సత్తయ్య, శంకర్, రాజన్న, రాజారాం, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై నాటు వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కమ్యూనిటీ కాంటాక్ట్‌తోనే నేరాల నియంత్రణ

మందమర్రిరూరల్: పోలీసుల కమ్యూనిటీ కాంటాక్ట్‌తోనే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని బెల్లంపల్లి ఏసీపీ సదయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా మంగళవారం సాయంత్రం మార్కెట్ ప్రాంతంలో వాహనాలు తనిఖీ చేశారు. సరైన నంబర్లు, ధ్రువీకరణ పత్రాలులేని 35 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ నేరాల నియంత్రణకు ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. కొంతమంది వాట్సాప్ గ్రూపుల్లో రెచ్చిపోయి పోస్టులు పెడుతున్నారని, అదికూడా నేరం కిందకే పరిగణలోకి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై చంద్రకుమార్, రామకృష్ణాపూర్ ఎస్సై అశోక్, కాసిపేట ఎస్సై గంగారాం, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బెల్లంపల్లి ఏసీపీ సదయ్య

తాళం వేసి ఉన్న రెండిళ్లలో చోరీ

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని సర్‌సిల్క్‌కాలనీలో సోమవారం రాత్రి తాళం వేసి ఉన్న రెండిళ్లలో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఓ ప్రైవేట్ ఏజెన్సీలో కార్మికుడిగా పనిచేస్తున్న జమీల్ తన భార్య ఆరిఫా బేగం అనారోగ్యం కారణంగా సోమవారం ఇంటికి తాళం వేసి మంచిర్యాలలోని ఆస్పత్రికి వెళ్లారు. మంగళవారం ఉదయం ఇంటికి వచ్చేసరికి తాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. అందులోని మూడుతులాల బంగారు ఆభరణాలు, రూ.5 వేల నగదు అపహరించినట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న ఎస్సై చంద్రశేఖర్ సంఘటన స్థలాన్ని సందర్శించారు. అదేకాలనీలోని టీఆర్–3 క్వార్టరులో నివాసం ఉంటున్న ఖాజా మోయినొద్దీన్ రెండు నెలలుగా ఇంట్లో ఉండటం లేదు. సోమవారం రాత్రి ఇంటితాళం పగులగొట్టి ఉండడంతో స్థానికుల సమాచారం మేరకు ఇంటికి వచ్చి చూడగా వస్తువులు చిందరవందర చేసి ఉన్నాయి. రెండు తులాల బంగారు, వెండి ఆభరణాలు అపహరణకు గురైనట్లు బాధితుడు తెలిపాడు. సంఘటన స్థలాన్ని టౌన్ ఎస్సై చంద్రశేఖర్, పోలీసులు సందర్శించి వివరాలు సేకరించారు. డాగ్‌స్క్వాడ్, వేలిముద్ర నిపుణులతో విచారణ చేపట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.



విచారణ జరుపుతున్న పోలీసులు

చెత్త సేకరణలో సర్పంచ్

కాసిపేట: సోమగూడెం(కె) సర్పంచ్ సఫాట్ శంకర్ ట్రాక్టర్‌తో ఇళ్లలోని చెత్తను సేకరించి పారిశుద్ధ్యంపై తనకున్న శ్రద్ధను చాటుకుంటున్నాడు. 20 రోజులుగా గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మెకు దిగడంతో గ్రామాల్లో పారిశుధ్యం పేరుకుపోతోంది. దీంతో మంగళవారం స్వయంగా పంచాయతీ ట్రాక్టర్‌తో ఇంటింటికీ తిరుగుతూ చెత్త సేకరించి డంపింగ్‌యార్డుకు తరలించారు. ప్రభుత్వం గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు త్వరితగతిన పరిష్కరించి గ్రామాలు పరిశుభ్రంగా ఉండేల చూడాలని కోరారు.



చెత్తను సేకరిస్తున్న సర్పంచ్ శంకర్

దారితప్పిన గురువు!

అతనో ఉపాధ్యాయుడే..అవకాశం కలిసి వచ్చి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా కొనసాగుతున్నాడు. తాత్కాలిక ప్రిన్సిపాల్ అయినప్పటికీ ఉపాధ్యాయులపై పెత్తనం చేలాయిస్తూ వేధింపులకు పాల్పడుతున్నాడు. మహిళా ఉపాధ్యాయుల పట్ల అసభ్యకరంగా ప్రవరిస్తూ ఉపాధ్యాయ వృత్తికి మచ్చతీసుకొస్తున్నాడు. జైపూర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకులం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బాలభాస్కర్ ప్రవర్తనపై ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- గురుకులం నిర్వహణ గాలికి
- విద్యార్థులపై పర్యవేక్షణ కరువు
- ఉపాధ్యాయినుల పట్ల అసభ్యకర ప్రవర్తన
- జైపూర్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ తీరిదీ..

జైపూర్(చెన్నూర్): జైపూర్ గురుకులంలో సుమారు 700 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తుండగా సుమారు 40 మంది ఉపాధ్యాయులు, అధ్యాపకులు విద్యాబోధన చేస్తున్నారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మూడేళ్ల క్రితం వరంగల్ జిల్లాకు డిప్యూటేషన్‌పై వెళ్లడంతో ఇక్కడ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న బాలభాస్కర్‌కు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు అప్పగించారు. అప్పటి నుంచి ఉపాధ్యాయులను చిన్నచూపు చూడడమే కాకుండా బూతులు మాట్లాడుతున్నాడని, విద్యార్థుల ముందే దూషిస్తున్నాడని ఉపాధ్యాయులు వాపోతున్నారు. అంతే కాకుండా మహిళా ఉపాధ్యాయులతో అసభ్యకరంగా ప్రవరిస్తూ లైంగికంగా వేధించడంతో మానసికంగా ఆందోళనకు గురవుతున్నారు. విషయాలు బయటికి తెలిస్తే ఉపాధ్యాయుల పరువు, కుటుంబ సభ్యులకు తెలిస్తే ఎక్కడ ఉద్యోగం మానేయిస్తారోమోనన్న భయంతో వారిలో వారే కుమిలిపోతున్నారు. ఇతని వేధింపులు తాళలేక గతేడాది ఓ తాత్కాలిక ఉపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు ఉద్యోగం కూడా మానేసిన సంఘటనలు ఉన్నాయి. అంతే కాకుండా అతను రెగ్యులర్‌గా ఇక్కడ ఉండడంలేదని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి జైపూర్ సాంఘిక సంక్షేమ గురుకులంలో రెగ్యులర్ ప్రిన్సిపాల్‌ను నియమించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

నిజాలు తెలుసుకుంటాం

జైపూర్ గురుకులంలో ఉపాధ్యాయుల వేధింపులపై నిజాలు తెలుసుకుంటాం. గతంలో వొకేషనల్ ఉపాధ్యాయులు రెగ్యులర్‌గా రాకపోవడంతో ఇద్దరిని మందలించాం. ఆతర్వాత మళ్లీ ఎలాంటి ఫిర్యాదులు మాకు రాలేదు. నిజానిజాలు తెలుసుకుని తప్పనిసరిగా సరిచేసుకునేలా చూస్తాం.
– కొప్పుల స్వరూపరాణి, గురుకులాల ఆర్సీవో, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా

నేను ఎవరినీ వేధించలేదు

నేను ఉపాధ్యాయులతో ఫ్రెండ్లీగా ఉంటున్నాను. ఎవరినీ వేధించలేదు. మహిళా ఉపాధ్యాయులపై కామెంట్స్ చేయలేదు. గతేడాది ఓ ఉపాధ్యాయుడికి సెలవు మంజూరు విషయంలో చిన్నగా విభేదాలు వచ్చాయి. కానీ ఆతర్వాత అందరితో మంచిగానే ఉంటున్నా.
– బాలభాస్కర్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్

రూ.1.50 కోట్లతో ఉడాయించిన చిట్టీ వ్యాపారి

- బాధితుల ఫిర్యాదుతో నిందితుడి అరెస్టు

మంచిర్యాలక్రైం: రూ.1.50 కోట్లతో ఓ చిట్టీ వ్యాపారి ఉడాయించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం రామకృష్ణాపూర్‌కు చెందిన తాళ్లపల్లి విజయకుమార్ 2016 నుంచి చిట్టీ వ్యాపారం నడిపిస్తున్నాడు. కొంతకాలంగా చిట్టి సభ్యులకు డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. 2023 జనవరి నుంచి కనిపించకుండా పోవడంతో బాధితులు గుండా రమేశ్‌తో పాటు మరికొందరు మే 10న పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా బెంగళూర్‌లో గుర్తించారు. మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

బీపీఏ జీఎం దేవేందర్ బదిలీ

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న జి.దేవేందర్‌ను బదిలీ చేస్తూ మంగళవారం యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. దేవేందర్‌ను మార్కెటింగ్ జీఎంగా బదిలీ చేస్తూ ఎస్టేట్స్ జీఎంగా విధులు నిర్వహిస్తున్న రవిప్రసాద్‌ను బెల్లంపల్లి ఏరియాకు జనరల్ మేనేజర్‌గా బదిలీ చేసింది.

ఆరోగ్య క్లీనిక్‌ను సద్వినియోగం చేసుకోవాలి

బెల్లంపల్లి: మహిళలు ఆరోగ్య క్లీనిక్‌ను సద్వినియోగం చేసుకోవాలని బెల్లంపల్లి డెప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో విజయ పూర్ణిమ అన్నారు. మంగళవారం తాళ్లగురిజాల పీహెచ్‌సీని సందర్శించి మహిళలకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనారోగ్య సమస్యతో ఆస్పత్రికి వచ్చే ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్యం అందించాలన్నారు. ముఖ్యంగా మహిళల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో వైద్యురాలు శ్రీవిద్య, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

వేతనం లేని ‘స్వచ్ఛ’ డ్రైవర్లు!



చెన్నూర్ మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆటో డ్రైవర్లు

- చెన్నూర్ మున్సిపాలిటీలో ఏడాదిన్నరగా నిరీక్షణ
- జీతాలు రాక పనులు మానేసిన పలువురు డ్రైవర్లు
- అగ్రిమెంట్ మాటున ఆందోళనలు చేయకుండా కట్టడి
- ఇదీ బల్దియా అధికారుల నిర్వాకం

చెన్నూర్: ‘అమ్మ పెట్టదు.. అడుక్కోనివ్వదు’ అన్న చందంగా మారింది చెన్నూర్ మున్సిపాలిటీలో అధికా రులు తీరు. 18 నెలలుగా వేతనాలు లేక వేతలు పడుతున్న తాత్కలిక ఉద్యోగులపై కనికరం చూప డం లేదు. రెక్కాడితే కానీ డొక్కాడని డ్రైవర్లు 18 నెలలుగా జీతాలు రాకపోవడంతో అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఈ నెల.. వచ్చే నెల అంటూ అధికారులు డ్రైవర్లకు వేతనాలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు.

బల్దియాలో ఇలా..

చెన్నూర్ మున్సిపాలిటీలో 18 వార్డులు 23,547 జనాభా ఉంది. వార్డులలో చెత్తా సేకరణ కోసం అధికా రులు 16 స్వచ్ఛ ఆటోలను కొనుగోలు చేశారు. ఆటోలపై పని చేసేందుకు రెండున్నరేళ్ల క్రితం తాత్కలిక పద్ధతిలో 16 మంది డ్రైవర్లను నియమించారు. మొ దటి ఏడాది వీరికి వేతనాలు సక్రమంగానే అందజేశారు. 18 నెలల నుంచి వేతనాలు సక్రమంగా ఇవ్వడం లేదు. జీతాలు ఇవ్వాలని అధికారులను అ డిగితే కలెక్టర్ నుంచి అప్రూవల్ రావాలని కాలం వెళ్లదీస్తున్నారు. వేతనాల కోసం నిరీక్షించి సకాలంలో రాకపోవడంతో ఇప్పటికే 8 మంది డ్రైవర్లు కూలీ ప నులు చేసుకుంటున్నారు. మరో ఎనిమిది మంది జీతాల రాకపోతాయా అన్న ఆశతో విధులు నిర్వహిస్తున్నారు.

పోరాడితే అంతే..

గతేడాది వేతనాలు ఇవ్వాలని డ్రైవర్లు ఆందోళన చేపట్టారు. డ్రైవర్లు తమ హక్కుల కోసం పోరుబాట పడితే జీర్ణించుకోలేని అధికారులు ఆందోళన చేడితే ఉద్యోగం నుంచి తొలగిస్తామని హుకుం జారీ చేశారు. అంతటితో ఆగకుండా, ఇకపై ఆందోళన చేయబోమని డ్రైవర్లతో ఒప్పంద పత్రం రాయించుకున్నారు. దీంతో ఇప్పుడు వేతనాల కోసం అధికారులతో మాట్లాడలేని పరిస్థితి నెలకొంది.



చెన్నూర్ మున్సిపాలిటీలో స్వచ్ఛ ఆటో డ్రైవర్లతో అధికారులు రాయించుకున్న ఒప్పందపత్రం